క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించరూ..



అధ్యాపకులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలువురు అధ్యాపకులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండి అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తమ సంపూర్ణ మద్దతును ఇస్తామని అధ్యాపకులు తెలిపారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేట పీఆర్సీ డొంకలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులను బుధవారం అందజేశారు. మిక్సీ, రైస్ కుక్కర్, సూట్ కేసులు, 100 మందికి చీరలను దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త జగన్నాథం, పద్మజ దంపతులు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గోపాలకృష్ణమూర్తి, విష్ణుతేజ, వెంకటేశ్వర్లు, వసంతకుమార్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేటలోని ఉడ్‌హౌస్ సంఘంలో పేదలకు దుప్పట్లను అప్పల సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గురుకిషోర్ మాట్లాడారు. 500 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వంశీ, మధు, నాగి, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఆదాల రాక నేడు

నెల్లూరు (సెంట్రల్): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుకు గురువారం రానున్నారని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

గ్రిగ్స్ పోటీలకు ఎంపికలు రేపు

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ స్థాయిలో వచ్చే నెల్లో నిర్వహించనున్న స్కూల్ లెవల్ గేమ్స్ గ్రిగ్స్ పోటీలకు జట్లను శుక్రవారం ఎంపిక చేయనున్నామని రూరల్ జోన్ వైస్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 క్రీడలకు సంబంధించి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు సౌత్‌మోపూరులోని జెడ్పీ హైస్కూల్‌ను సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర నియోజకవర్గంలో ఫిబ్రవరి నాలుగు నుంచి ఆరు వరకు నిర్వహించనున్న 98వ గ్రిగ్స్ మెమోరియల్ పోటీలకు సంబంధించిన ఎంట్రీ ఫారాలు, ఫీజును శుక్రవారం మధ్యాహ్నం లోపు చెల్లించాలని ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫజులుల్లా అలీ తెలిపారు. సంతపేటలోని ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12 గంటల్లోపు ఎంట్రీ ఫీజును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చెల్లించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు గుర్తింపు పొందిన అన్ని స్కూళ్ల వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రాపూరు సీఐగా కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు డీటీసీ సీఐ కోటేశ్వరరావును రాపూరు సీఐగా నియమిస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన కోటేశ్వరరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్సైగా గతంలో విధులు నిర్వర్తించారు.

ఎన్టీఆర్‌కు నివాళి

నెల్లూరు (టౌన్): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని పార్టీ నేతలు బుధవారం నిర్వహించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిపారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర., మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా తీరం.. జనసంద్రం





పర్యవేక్షిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్





సెల్ఫీలతో సందడి



సరదాగా గడుపుతూ..

- కోలాహలంగా ఏటి పండగ
- భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల నిమజ్జనం

నెల్లూరు(బృందావనం): సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏటి పండగతో నగరంలోని పినాకినీ తీరం జనసంద్రమైంది. తమ ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజించిన గొబ్బెమ్మలను ఊరేగింపుగా పెన్నమ్మ చెంతకు మహిళలు తీసుకొచ్చారు. అనంతరం పినాకిని తీరంలో గంగమ్మ తల్లి ఒడిలో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు కుంకుమ.. బొట్లు పెట్టుకుంటూ.. పసుపు, కుంకుమ, గాజులను గంగమ్మ తల్లికి సమర్పించారు. గొబ్బెమ్మల ఆటపాటలు, గాలిపటాలను ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పెన్నా తీరం హోరెత్తింది. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజిని విద్యుద్దీపాలతో అలంకరించారు. రంగనాయకులపేట, గోపురంవీధి, శెట్టిగుంటరోడ్డు, మైపాడు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, సంతపేట పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ సూచనల మేరకు అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

కొలువైన దేవతామూర్తులు

ఏటి పండగలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దేవతామూర్తులు పవిత్ర పినాకినీ తీరానికి తరలివచ్చి భక్తులను కటాక్షించారు. గణనాథుడు, ఇరుకళల పరమేశ్వరి, రాజరాజేశ్వరి అమ్మవారు, తల్పగిరి రంగనాథస్వామి, మూలస్థానేశ్వరుడు, వేణుగోపాలస్వామి, వేదగిరి లక్ష్మీనృసింహుడు, జొన్నవాడ మల్లికార్జున సమేత కామాక్షితాయి, వెంగమాంబ పేరంటాలు అమ్మవారు కొలువై భక్తులను కటాక్షించారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని పెన్నా సమీప ప్రాంతంలో నిర్వహించిన ఏటి పండగకు కార్పొరేషన్ అధికారులు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. నగరంలోని 53, 54వ డివిజన్ల ప్రజలు పెన్నా తీరంలో సేదతీరి కుటుంబసభ్యులతో ఉత్సాహంగా గడిపారు. గొబ్బెమ్మలను పెన్నాలో వదిలారు. కార్పొరేటర్ సుజాత, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కోలాట ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఉత్సాహంగా గొబ్బెమ్మల పండగ

నెల్లూరు(బృందావనం): నగరంలోని పెన్నా తీరంలో నిర్వహించిన గొబ్బెమ్మల పండగలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దేవతామూర్తులు తరలివచ్చి పెన్నా తీరంలో కొలువుదీరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గొబ్బెమ్మల నిమజ్జనాన్ని అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికార యంత్రాంగం, సహకరించిన సిబ్బంది, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలను తెలియజేశారు. గొబ్బెమ్మల పండగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు అస్మా, జయలక్ష్మి, రవిచంద్ర, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, అఫ్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, ఏపీ అగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆధ్వర్యంలో పోస్టర్లను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సోమశిల, మర్రిపాడు, ఏఎస్‌పేట ఎస్సైలు బోజ్యానాయక్, విశ్వనాథ్‌రెడ్డి, నరేష్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి బొకేలను అందజేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

యోగి వేమనకు కళాంజలి



నెల్లూరు(బృందావనం): యోగి వేమన జయంతిని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన కళాకారుడు, ఉపాధ్యాయుడు సోమా పద్మారత్నం కళాత్మకంగా అంజలి ఘటించారు. బాల్ పాయింట్ పెన్‌తో ఆర్ట్, మర్రి ఆకుపై వేమన చిత్రాన్ని కార్వింగ్‌తో గంట సమయంలో తీర్చిదిద్దారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. 24వ డివిజన్లోని జాఫువానగర్, కల్లూరుపల్లిలోని ప్రజాశక్తినగర్‌లో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో స్థానికులు పలు సమస్యలను తెలియజేశారన్నారు. ఈ క్రమంలో పనులను ప్రారంభించారని తెలిపారు. కార్పొరేటర్ శాంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీను, నేతలు అజయ్, హృదయ్‌కుమార్, శేఖర్, భారతమ్మ, వరలక్ష్మి, మస్తాన్, రవీంద్ర, మాల్యాద్రి, పెంచలయ్య, రషీద్, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భూ కుంభకోణంపై విచారణ జరపండి

నెల్లూరు (సెంట్రల్): కలువాయి మండలంలో బయటపడిన భూ కుంభకోణానికి సంబంధించి జిల్లా అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం కోరారు. ఈ మేరకు కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వ భూములకు లేని పట్టాలను సృష్టించి ప్రభుత్వానికే విక్రయించి రూ.1.75 కోట్ల ప్రజాధనాన్ని మింగిన విషయంలో తహసీల్దార్ల పాత్ర ఉందని తెలిసిందన్నారు. దీనిపై కలెక్టర్ చక్రధర్‌బాబు మరింత లోతుగా విచారణ జరిపి కుంభకోణం వెనుక ఉన్న అందరిపై చర్యలు చేపట్టాలని, రాబోయే రోజుల్లో వెంకటగిరి నియోజకవర్గంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని కోరారు.

23న ఐక్య క్రైస్తవ ప్రార్థన దినం

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని రోమన్ క్యాథలిక్ క్యాథడ్రైల్ (ఆర్సీఎం చర్చి)లో ఐక్య క్రైస్తవ ప్రార్థన వారాన్ని ఈ నెల 24 వరకు నిర్వహించనున్నామని జిల్లా క్రైస్తవ సమాఖ్య వేదిక ప్రధాన కార్యదర్శి రెవరెండ్ రాజశేఖర్ దాసరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐక్య క్రైస్తవ ప్రార్థన దినాన్ని సోమవారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఫాదర్లు, పాస్టర్లు, తదితరులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై గురువారం నుంచి శనివారం వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నెల్లూరు రూరల్: క్రీడాభివృద్ధికి తగిన విధంగా తోడ్పాటునందిస్తామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మాలాలీ ఆధ్వర్యంలో నారాయణరెడ్డిపేటలో ఏర్పాటు చేసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించిన అనంతరం గిరిధర్‌రెడ్డి మాట్లాడారు. పది రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో 20 జట్లు పాల్గొననున్నాయని చెప్పారు. పార్టీ నేత కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, నేత లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నిరసన



నెల్లూరు(మినీబైపాస్): బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం ఆఫీస్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెంషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జిలానీఖాన్, మాజీ జిల్లా కార్యదర్శి మహబూబ్ పీరా, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఇస్కాన్ సిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో కమిషనర్, నగరపాలక సంస్థ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో పారిశుధ్య సమస్యలను ఎక్కువగా తెలియజేస్తున్నారని చెప్పారు. దీనిపై దృష్టి సారించి కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఫ్లెక్సీల నిషేధాన్ని ఈ నెల 28 నుంచి తప్పక పాటించాలని చెప్పారు. క్లాత్ ఫ్లెక్సీలను మాత్రమే ఉపయోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రవిచంద్ర, జయకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాబాబాకు ఘన నివాళి

నెల్లూరు(వేదాయపాళెం): ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ముఖ్య సంస్థాపకుడు బ్రహ్మాబాబా 56వ పుణ్యస్మృతి దినాన్ని వేదాయపాళెంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సంస్థ సంచాలకులు ప్రసన్న మాట్లాడారు. బ్రహ్మాబాబా 1936లో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయాన్ని స్థాపించారని చెప్పారు. తన ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచంలోని అనేక మందిని ప్రభావితం చేశారని పేర్కొన్నారు. 135 దేశాల్లో సంస్థ సేవలను అందిస్తోందని వివరించారు. ప్రతి ఒక్కరూ శాంతితో మెలగాలని సూచించారు. సంఘమిత్ర స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కమిషనర్ రవీంద్రరెడ్డి, బీఎన్నార్ కంపెనీ మేనేజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ కార్నర్

రైల్లో గంజాయి తరలించేందుకు యత్నం

నెల్లూరు(క్రైమ్): రైల్లో గంజాయిని తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి.. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో నిందితుడి వివరాలను రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు బుధవారం వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా జీ మాడుగుల మండలం వాకపల్లికి చెందిన మత్స్యలింగం ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి ఇతర జిల్లాల వ్యాపారులకు కమీషన్ పద్ధతిపై గంజాయిని సరఫరా చేయసాగారు. ఇందులో భాగంగా హిందూపురానికి చెందిన భీమప్పకు నాలుగు కిలోల గంజాయిని ఇచ్చేందుకు విశాఖపట్నం నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. బుధవారం తెల్లవారుజామున గూడూరులో దిగి అక్కడి నుంచి ధర్మవరానికి టికెట్ తీసుకున్నారు. నేర నియంత్రణలో భాగంగా గూడూరు రైల్వే ఎస్సై కొండప్పనాయుడు తన సిబ్బందితో కలిసి ఫెన్స్ సాయంతో తనిఖీలు చేయసాగారు. విషయాన్ని గమనించిన మత్స్యలింగం పరారయ్యేందుకు యత్నించగా, ఎస్సై వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకొని బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులోని నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం అరెస్ట్ చేశారు. భీమప్పను సైతం అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. నేరాల కట్టడిలో భాగంగా రైళ్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలను ముమ్మరం చేశామని, ఇప్పటికే పలువురు నేరస్తులను అరెస్ట్ చేశామని వివరించారు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన రైల్వే ఎస్సై, కానిస్టేబుళ్లు ప్రకాష్, వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు. రైల్వే సీఐ శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని యువకుడు నెల్లూరు వైపు వెళ్లే హౌరా రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో పట్టాలపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. బ్లూ కలర్‌పై వైట్ కలర్ గళ్లున్న ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ జర్కిన్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

అక్కడ ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాల కోసం ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో ఆరాతీశారు.

విద్యుత్ వైర్ల చోరీ

నెల్లూరు(క్రైమ్): నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల్లోని విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు పరిధిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బ్లాక్ 45, 38 వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్ల తలుపులను బుధవారం తెల్లవారుజామున పగలగొట్టి అందులో ఉన్న రూ.లక్ష విలువజేసే విద్యుత్ వైర్లను అపహరించారు. గమనించిన వాచ్‌మెన్ వికాస్ అడ్డుకున్నారు. వారు అతడ్ని తోసేసి పరారయ్యారు. దీంతో కంపెనీ సీనియర్ ఇంజినీర్ సూర్యప్రకాష్‌కు ఫోన్లో అయన సమాచారం అందించారు. దీనిపై వేదాయపాళెం పోలీసులకు ఇంజినీర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దుకాణాల వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు ఈ నెల 14న గమనించి 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని వృద్ధుడ్ని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు కోరారు.

చోరీపై ఫిర్యాదు

- వస్తువులు ఇంట్లోనే ఉండటంతో చర్యలొద్దని వినతి

నెల్లూరు(క్రైమ్): తన ఇంట్లో చోరీ జరిగిందని వేదాయపాళెం పోలీసులకు మహిళ ఫిర్యాదు చేశారు. చివరికి చోరీకి గురయ్యాయని భావించిన వస్తువులు ఇంట్లోనే ఉండటంతో ఫిర్యాదుపై చర్యలొద్దని పోలీసులను కోరారు. వివరాలు.. వేదాయపాళెంలోని కేశవులునగర్‌లో నివాసం ఉంటున్న సుజాత ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. ఈ నెల 14న తన కుమార్తెతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికెళ్లారు. అదే రోజు సాయంత్రం కుమారుడు సైతం వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని పనిమనిషి గౌరీ బుధవారం గమనించారు. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో విషయాన్ని యజమానురాలికి ఫోన్లో తెలియజేశారు. దీంతో సుజాత నెల్లూరు చేరుకున్నారు. బీరువాను పరిశీలించగా బంగారు ఆభరణాలు.. నగదు కనిపించకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాధితురాలు మరోమారు నిశితంగా పరిశీలించగా, చోరీకి గురయ్యాయని భావించిన వస్తువులు కనిపించాయి. దీంతో తన ఫిర్యాదుపై చర్యలొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.